


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

**ఆమె నవ్వి** - "ఎక్కడ మునిగి ఎక్కడ తేలారండీ?" అంది.

వెన్నెలలు కాయించే ఆ నవ్వుకు నేను అతి త్వరలోనే దూరమవుతున్నానన్న బాధ నన్ను మళ్ళీ ఆవహించింది.

రాజమండ్రిలో ఫామిలీ ఫోటో తీయించుకున్నాం. కాపీలు రావడానికి ఆలస్యమవుతుంది. శ్రీమతిని ఫోటోలు కలకత్తాకు పంపమన్నాను. జర్మనీలో పదహారు నెలలపాటు ఆ ఫోటోను చూస్తూనే నేను బ్రతకాల్సి ఉంది.

అత్తవారింట్లో ఇంకో రకం ప్రశ్న ఎదురైంది నాకు. అది నేనూహించనిది.

ఒకటి రెండు నెలలపాటు విదేశాల్లో ఉండాలనుకున్నవారే అక్కడి వినోద, విలాసాలకు దాసులై - అక్కడే శాశ్వతంగా స్థిరపడి వేరే పెళ్ళిళ్లు చేసుకుని పాత కుటుంబాల సంగతి మరిచిపోవడం కూడా జరిగిందట. ఈ విషయం మా అత్తగారికే స్ఫురించింది.

మా అమ్మకు నా పైన అనుమానం లేదు. ఆమె నా క్షేమం గురించే ఆలోచిస్తుంది. మా అత్తగారికైతే తన కూతురి గురించే ధ్యాస. ఆ ధ్యాసలో నామీద అనుమానం పుట్టింది.

అదృష్టవశాత్తూ అత్తగారి మాటల ప్రభావం శ్రీమతిలో అనుమానాలను సృష్టించలేదు. ఏడు సంవత్సరాలుగా కలిసి కాపురం చేసినందుకు ఆమె నన్నామాత్రం అర్థం చేసుకుంది.

"పదహారు నెలలంటే మాటలు కాదు. అందరూ తాగితందనాలాడే దేశమది. ఆడది వంటి మీద గుడ్డ సరిగ్గా ఉంచుకోని దేశమది. మగాడొక్కడూ అన్నాళ్లక్కడుంటే చెడిపోయి తీరాల్సిందే -" అని మా అత్తగారంటే -

"నా పెళ్లికి ముందాయన చదువు పేరు చెప్పి వాల్తేర్లో అయిదేళ్లున్నారు. విస్కీ బ్రాందీల విషయమటుంచి - సిగరెట్‌కానీ ఆఖరికి కాఫీ టీలుకానీ అలవాటు కాని మనిషి - ఇప్పుడిద్దరు బిడ్డల తండ్రి అయ్యాక విదేశాలు వెళ్లి ఏదో మారిపోతారని అనుకోవడం చాలా తెలివితక్కువ -" అని శ్రీమతి వాదించిందట.

ఈ విషయమామె నాకు చెప్పడంలో నమ్మకంతోపాటు - హెచ్చరిక, అభ్యర్థన కూడా లేకపోలేదు.

అత్తగారి విషయమలాగుంటే మామగారికి నేనంటే విపరీతమైన నమ్మకమూ, అభిమానమూనూ. ఆయన నా గురించి మరోవిధంగా కంగారుపడ్డారు. "నీవి లేనిపోని ఆదర్శాలు. నువ్వు వెడుతున్నది చలిదేశం. ఏ దేశపు అలవాట్లయినా ఆ దేశపు వాతావరణాన్ని బట్టి ఏర్పడతాయి. అక్కడున్నంతకాలం నువ్వు మాంసాహారానికీ, విస్కీ, బ్రాందీలకూ తటపటాయించ కూడదు -" అంటూ ఉదాహరణగా ఆయన నాకో పురాణగాథ కూడా చెప్పారు.

ఒక పర్యాయం విశ్వామిత్రుడు అడవిలో తిరుగుతూ అంతులేని ఆకలికి గురయ్యాడట. ఎక్కడా ఒక పండుకానీ, గుక్కెడు నీళ్లుకానీ దొరకలేదుట. అలా నడుస్తూండగా ఆయనకో కసాయివాడి గుడిసె కనపడిందిట. అప్పుడా కసాయివాడు గొడ్డు మాంసం తింటున్నాడుట. విశ్వామిత్రుడు వాడిని సమీపించి ఏముంటే అది పెట్టమని అడిగి - వాడెంగిలి చేసిన గొడ్డు మాంసం మినహా మరేమీలేదని గ్రహించి వాడు వారిస్తున్నా వినకుండా ఆ ఎంగిలి మాంసమే తిన్నాడుట. రెండు ముక్కలు తినేసరికాయనకు ప్రాణం తెప్పరిల్లిందిట. ఈలోగా కసాయివాడాయనకు గ్లాసుతో మంచినీళ్లు తెచ్చిచ్చాడుట.

"గోహత్య చేసి బ్రతికే కసాయివాడివి. నీచేతి మంచినీళ్లు తాగుతాననుకున్నావా?" అన్నాడుట విశ్వామిత్రుడు వాడివంక గ్రుడ్లురిమి చూసి.

కసాయివాడాశ్చర్యపడి - "అదేంటి స్వామీ! నా ఎంగిలి గొడ్డుమాంసం తిన్న మీరు నేను తాగిన నా చేతి నీళ్లు తాగకపోవడమేమిటి?" అనడిగాడట.

"అప్పటి పరిస్థితి వేరు. అప్పుడది తినకపోతే నా ప్రాణం నిలబడి ఉండేదికాదు. అప్పుడు నేను ఆకలి అనే జబ్బుతో బాధపడుతున్నాను. జబ్బుకు ముందుగా ఇది వాడకూడదన్న నిషేధం లేదు. నా ఆకలి జబ్బు నయమై నా ప్రాణం నిలబడగానే - నా ధర్మాలు నేను పాటించవలసి ఉంది. అందుకే పాటిస్తున్నాను.." అని అక్కణ్ణించి వెళ్లిపోయాడట విశ్వామిత్రుడు.

ఈ కథ నాకు చెప్పి - "కాబట్టి ఈ దేశంలో నీకే ఆదర్శాలున్నప్పటికీ విదేశాలు వెళ్లినప్పుడు మాత్రం అక్కడి పరిస్థితులకు అనుకూలంగా వాటిని సడలించుకోవాలి. బీ ఏ రోమన్ ఇన్ రోమ్. తిరిగి రాగానే మళ్లీ నీవు కోరిన విధంగా ఉండవచ్చు." అన్నారు మామగారు.

ప్రాణం నిలబెట్టుకోడం కోసం ఏమైనా చేసి ఆ తర్వాత ప్రాణం నిలబడ్డాక మళ్లీ మానవత్వపు ధర్మాలను పాటించాలన్న వేదాంతం నాకు నచ్చింది. కానీ నాకు కలిగిన ఒక సందేహాన్ని ఆయనకు చెప్పుకోలేకపోయాను.

విశ్వామిత్రుడి ప్రాణం ఒక కసాయివాడి కారణంగా నిలబడింది. ఆ కృతజ్ఞతతో విశ్వామిత్రుడు కసాయివాళ్ల బాగోగుల గురించి ప్రత్యేకంగా ఏమైనా కృషి చేశాడా అన్నది నా సందేహం. అడిగితే మామగారు మరోవిధంగా భావించ వచ్చునని భయపడ్డాను. అయితే ఆయనతో - "నాగురించి లేనిపోని భయాలు పెట్టుకోకండి. అవసరాన్ని బట్టి విదేశాల్లో తప్పక తాగ గలను." అని హామీ యిచ్చాను. ఈ హామీ అత్తగారికి నచ్చలేదు. తాగనని హామీ ఇవ్వాలి కానీ తాగుతానని హామీ ఇవ్వడమేమిటని ఆమె తనలో తాను గొణుక్కుంది.

స్వర్గంలో సురాపానమూ, విదేశాల్లో సారాపానమూ తప్పుకాదని నేను అత్తగారి ముందే శ్రీమతికి చెప్పాను. ఆమె భయపడుతుందని తెలిసినా - అత్తగార్లను భయపెట్టి ఆనందించే అల్లుళ్ల మనస్తత్వం నాకానందాన్నే కలిగించింది.

మే నెల పంతొమ్మిదిన నా ప్రయాణం నిశ్చయమైంది.

ప్రభుత్వం నిక్కచ్చిగా ప్రవర్తిస్తూండడం వల్ల రైల్వే పనివారిలో కొందరు సమ్మెలో చేరలేదు. సమ్మె ఆరంభమైన వారంరోజుల తర్వాత ప్రభుత్వం కొన్ని రైళ్లను నడపడం మొదలెట్టింది. నా ప్రయాణం నాటికి మెయిలు కాక హైదరాబాద్ - హౌరా ఎక్స్‌ప్రెస్ కూడా తిరుగుతోంది. నేను మాత్రం రిస్కు తీసుకోదల్చుకోలేదు. ముందు మెయిలుకు ప్రయత్నించి అందులో దొరక్కపోతేనే ఎక్స్‌ప్రెస్ ఎక్కాలనుకున్నాను.

ప్రయాణం రోజుకు నా మనసంతా బాగాలేదు. నా కూతురికి నా దగ్గర బాగా చేరిక. అది నన్ను విడిచి కొన్ని గంటలు మించి ఉండలేదు. పిల్లలిద్దరికీ కూడా ఆరోగ్యం బాగుండలేదు. ముఖ్యంగా అమ్మాయికి ప్రతిరోజూ ఏదో సమయంలో హఠాత్తుగా కాసేపు వళ్లు వేడెక్కి మళ్లీ చల్లబడుతూంటోంది.

వీడ్కోలు సమయం రానే వచ్చింది.

కంపార్టుమెంట్లో ఎక్కి గుమ్మం వద్ద నిలబడ్డాను.

ప్లాట్‌ఫారం మీద అమ్మ, నాన్నగారు, తమ్ముళ్లు, చెల్లెళ్లు, శ్రీమతి, పిల్లలు - ఉన్నారు. అమ్మాయికి జ్వరంవల్ల వళ్లు తెలియకుండా పడి ఉంది. దానికి నేను ఊరు వదిలి వెడుతున్నట్లు కూడా తెలియదు. అప్పుడది నా చెల్లెలి చేతుల్లో ఉంది. అబ్బాయిని శ్రీమతి ఎత్తుకుంది. వాడేమో నా దగ్గరకు వస్తానని ఏడుస్తున్నాడు. గొంతు మెదిపితే తన దుఃఖం బయటపడుతుందనో ఏమో - శ్రీమతి వాణ్ణి సముదాయించడం లేదు. ఆమె కళ్లలో నీళ్లు తిరగడం మొదలయింది. చీర చెంగుతో ఒత్తుకుంది. కానీ అని ఆగడంలేదు. ఉన్నట్లుండి శ్రీమతి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

అప్పుడు నా హృదయాన్నెవరో పెకలిస్తున్నట్లు తోచింది. అప్రయత్నంగా నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఏదో అందామనుకుంటే గొంతు పెగలలేదు.

నేనింకెవ్వరినీ చూడడం లేదు.

వళ్లు తెలియని జ్వరంలో ఉన్న కూతురు, దగ్గరకు వస్తానని ఏడుస్తున్న కొడుకు, వెక్కి వెక్కి ఏడుస్తున్న శ్రీమతి.. వారినే చూస్తున్నాను. రైలు కదిలింది.

ఒకటి కాదు.. రెండుకాదు.. ఏడేళ్ల అనుబంధం.

ఈ అనుబంధానికి కనీసం పదహారు నెలలైనా దూరం కమ్మని హెచ్చరిస్తూ ఓ పెద్దకూతపెట్టి మెయిలు వేగం పుంజుకుంది.

## 11

రాత్రి పదకొండు గంటలకు ట్రయిన్ భువనేశ్వర్ చేరుకుంది. రిక్షాలో కాలనీ చేరాను. ఆ రాత్రి సమయంలో నా రాకనెవ్వరూ గుర్తించలేదు. రవి వుంటే అతడు తప్పక మా యింటి వద్ద ఎదురు చూస్తూ కనబడి ఉండేవాడు. సెలవుమీద అతడు కుటుంబంతో సహా ఇంటికి వెళ్లిపోవడంతో - ఇంటి తాళం తీస్తున్న నాకు అసలైన ఒంటరితనపు అనుభూతి కలిగింది.

ఇంట్లో ఏమీలేవు. అన్నీ ఖాళీ. సద్దుకోవడం నాకిబ్బందన్న భావంతో శ్రీమతి మంచాలతో సహా అన్నీ ప్యాకింగు చేసేసి ఎవరింట్లో ఏమివ్వాలో నిర్ణయించేసింది. ఆ రాత్రికి నేను కటిక నేలపై తువ్వాలును దిండుగా చేసి పడుకున్నాను. రాత్రి సరిగా నిద్రపట్టలేదు. తెల్లవారు ఝామున ఎప్పుడో కాస్త కునుకు పట్టింది. బాగా పొద్దెక్కి ఏడయ్యాక భాస్కర్ వచ్చి తలుపు తట్టేవరకు నాకు మెలుకువ రాలేదు. అతడు నన్ను వారింటికి భోజనానికి ఆహ్వానించాడు.

నేనతణ్ణి ముందుగా పాస్‌పోర్టు గురించి అడిగాను. అదింకా రాలేదని తెలియగానే మనసు పాడయింది. అతణ్ణి పంపేసి కాలకృత్యాలు తీర్చుకుని టిఫినుకు వాళ్లింటికి వెళ్లాను.

"మీరుండేది వారం. ఈ వారం రోజులూ మా యింట్లోనే భోంచేయండి -" అంది శ్రీమతి భాస్కర్.

కాలనీలో నాకు తెలిసిన వారింకా ఉండడంవల్ల భాస్కర్‌కు కమిట్‌మెంటివ్వలేదు. ఎటొచ్చీ హృదయపూర్వకంగా ఆహ్వానించిన ఆ దంపతుల చూపులు నేనాకాలనీలో ఒంటరివాణ్ణి కానని స్పష్టం చేశాయి.

లాబొరేటరీలో భూషణ్‌ని కలిశాను. అతడు తన పాస్‌పోర్టు కలకత్తా వెళ్లి తెచ్చుకుని వచ్చాడు. నాది కూడా తయారైపోయిందనీ బెంగపడవద్దనీ అన్నాడు. చేతిలో ఫారిన్ రేఖ లేని నాకు ఈ పాస్‌పోర్టు కారణంగా ప్రయాణమాగిపోదుకదా అన్న భయం మనసులో ఉంది.

లాబరేటరీలో నా పేరున వస్తువులన్నీ స్టోర్సుకి తిరిగిచ్చేసి - "నోడ్యూస్" సర్టిఫికెట్ ఒకటి తీసుకోవాలి. ఆ విషయమై ఒక చోట నుంచి ఒక చోటకు తిరుగుతూ రోజుల్లా ఆఫీసులో గడిపాను.

అన్నయ్య దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. మూడురోజుల ముందు పోస్టు చేశాడది కలకత్తాలో. పాస్‌పోర్టు ఒకటి రెండు రోజుల్లో సిద్ధమవుతుందిట. అనవసరంగా పోస్టల్ డిలే ఎందుకూ - నువ్వు వెళ్ళేముందు కలకత్తా వస్తావుగదా - అక్కడ పెర్సనల్ డెలివరీ తీసుకోమని రాశాడు. నేను వెంటనే అన్నయ్య పేరిట ఓ ఆథరైజేషన్ లెటర్ రాసా - దాని సాయంతో వాడినే పాస్‌పోర్టు డెలివరీ తీసుకోమని వేరే ఉత్తరం రాసి రెండూ కలిపి ఒకే కవర్లో పెట్టి పోస్టు చేశాను.

జర్మనీ చలిదేశం కాబట్టి మణికట్టు దాకా చొక్కాతో కవర్ చేయడం అవసరమని అంతా సలహా యిచ్చారు. అందుకు గుడ్డలు శ్రీమతి రాజమండ్రిలో తనే ఎన్నిక చేసింది. సాయంత్రం అవి టౌన్లో టైలరింగ్ షాపులో ఇచ్చాను. ఎప్పుడూ సగం చేతుల చొక్కాలు తప్ప వేసుకోనని తెలిసిన టైలర్ ఆశ్చర్యపడి కారణం కూడా అడిగి తెలుసుకున్నాడు.

భువనేశ్వర్లో ఉన్న వారం రోజులూ నేను తిండి గురించి ఇబ్బంది పడలేదు. ఉన్న టైము తక్కువ కావడం వల్ల పిల్చిన వారందరిళ్లకూ వెళ్లలేకపోయాను. భాస్కర్ దంపతులకులాగే నా సీనియర్ కొలీగ్ భానోజీరావు, అతడి శ్రీమతికూడా నన్నాదరించి - నా ఒంటరితనాన్ని మరిపించారు.

రాత్రి ఇంటికి వెళ్లి పడుకునేసరికి మాత్రం ఏకాకినన్నభావం నన్ను వేధించేది. ఇలాంటి రాత్రులింకా పదహారు నెలలపాటు గడపాలంటే..?!

మే 23న లుఫ్తాన్సా ఎయిర్‌లైన్సు నుంచి నా ప్రయాణానికి సంబంధించిన ముఖ్యమైన కాగితాలు కొన్ని వచ్చాయి. అందులో పీ ఫారం ఉంది. అది నింపి రిజర్వు బ్యాంకువారి అనుమతి పొంది, పాస్‌పోర్టు తీసుకుని లుఫ్తానా ఎయిర్ లైన్సు వారిని కలకత్తాలో కలుసుకుంటే వారు మాకు టికెట్ ఇస్తారు.

ఈ కాగితాలకంటే ముఖ్యమైనవి సీయస్సయ్యార్నించి రావలసి ఉన్నాయి. ప్రభుత్వ ఆర్థికశాఖవారు మాకు వచిన స్కాలర్‌షిప్ గురించి ఒక ఉత్తర్వు జారీ చేస్తారు. ఆ ఉత్తర్వు వస్తే తప్ప మేము బయలుదేరడానికి లేదు. ఆ ఉత్తర్వు కాపీలు అన్ని రాష్ట్రాల రాజధానీ నగరాలలోని రిజర్వుబ్యాంకులకూ పంపుతారు.

మా ప్రయాణం రోజుల్లోకి వచ్చినా ఆ ఉత్తర్వు రాకపోవడంతో మేము అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ని కలుసుకుని మాట్లాడాము. ఆయన వెంటనే ఢిల్లీలోని హెడ్డాఫీసుకి ట్రంక్ కాల్ చేసి - ఉత్తర్వు పోస్టు చేసి రెండు రోజులయిందనీ ఈలోగా మిగతా ఫార్మాలిటీస్ ముగించవచ్చుననీ తెలుసుకున్నాడు. ఆయన వెంటనే అందుకు సంబంధించిన అసిస్టెంటుని పిలిచి బాండ్ తయారుచేయమన్నాడు.

ఈ బాండ్ ఒక పెద్ద తతంగం.

మేము ఈ స్కాలర్‌షిప్ అనుభవించి తిరిగి వచ్చాక సీయస్సయ్యార్లో నాలుగు సంవత్సరాల పాటు ఉంటామని హామీ యివ్వాలి. మా ప్రయాణం ఖర్చులు, ఈ స్కాలర్‌షిప్ సమయంలో ప్రభుత్వం మాగురించి పెట్టే ఖర్చులు - కలిపి హామీ మొత్తమవుతుంది. గడువు సమయానికి తిరిగి దేశానికి రాకపోయినా, అసలు విదేశాలలో ఉండిపోవాలనుకున్నా, తిరిగివచ్చి సీయసయ్యార్లో నాలుగు సంవత్సరాలుండకపోయినా, మేము మొత్తం డబ్బును సీయస్సయ్యార్‌కు ఇచ్చుకోవాలి. అలా ఇచ్చుకుంటానని నా గురించీ భూస్వామి లేక పర్మనెంట్ ఉద్యోగస్థుడైన అయిన వ్యక్తి పూచీ ఉండాలి. అదృష్టవశాత్తూ మా బాస్ నాకూ, భూషణ్‌కీ కూడా పూచీ

పడడానికంగీకరించాడు. హామీగా ఉండవలసిన మొత్తం తక్కువ కాదు. మా ఇద్దరి గురించే మా బాస్ తీసుకున్న రిస్కు సామాన్యమైనది కాదు.

ఆఫీసులో అసిస్టెంటు లెక్కకట్టగా - మనిషికి సుమారు ముప్పై అయిదు వేలు హామీ మొత్తం లెక్క తేలింది.

అవును మరి  పదహారు నెలల్లో మొదటి ఆరునెలలూ ఇండియాలో నాకు పూర్తి జీతం వస్తుంది. తర్వాత పదినెలలూ కరువు భత్యం మినహాయించుకుని మిగతా జీతం (అనగా బేసిక్ పే) వస్తుంది. దీనికి జర్మనీ ప్రయాణం ఖర్చు కలిపి - రెండు పెట్టి గుణించగా ఈ మొత్తం వచ్చింది. జర్మనీలో నాకు మార్కుల రూపంలో వచ్చే స్కాలర్‌షిప్ వగైరాలు దీనికి జోడించలేదు కాబట్టి సరిపోయింది కానీ ఈ హామీ మొత్తం లక్షరూపాయలు దాటిపోయేది.

అంటే నేను, భూషణ్ జర్మనీ వెడుతూండడం వల్ల మా బాస్‌కు మొత్తం డెబ్బైవేల రూపాయల జామీను బేరం తగిలింది. మా మీద నమ్మకం, అభిమానంతో ఆయన ఈ బాధ్యత తీసుకున్నాడు.

మేమిద్దరమూ ఎలాగూ తప్పక తిరిగివస్తాం కాబట్టి హామీ మొత్తం ఎంతైనా మాకు బాధలేదు. ఉన్న యిబ్బందల్లా - బాండ్ కోర్టు పేపర్ల మీద వ్రాయాలి. మా హామీ మొత్తానికి కోర్టు పేపర్ల విలువ అయిదువందల పదిరూపాయలు.

మన ప్రభుత్వ వ్యవహారాలెంత అయోమయంగా ఉంటాయో తెలుసుకునేందుకీ బాండు పేపర్ల ఉదంతం చాలు.

మేము ప్రభుత్వోద్యోగుల కిందే లెక్క. ఈ బాండు కేవలం ఫార్మాలిటీ. అలాంటప్పుడు ఏ తెల్లకాగితం మీద వ్రాయించి మా చేత సంతకం పెట్టించుకున్నా సరిపోతుంది. కానీ ఆఫీసలా ఒప్పుకోదు. ఆ అయిదు వందల పదిరూపాయల ఖర్చూ ఆఫీసుదే అయితే ముందుగా మేము పెట్టుబడి పెట్టి ఆ కోర్టు పేపర్లు కొని తెచ్చుకోవాలి.

ఇందుకు భూషణ్ ఒప్పుకోలేదు. నేను మెత్తబడడం చూసి నన్ను చాటుగా పిలిచి - "నాలుగు రోజుల్లో మన ప్రయాణముంది, ముందుగా ఖర్చు పెడితే మన డబ్బు వెనక్కురాదు. దగ్గరుండి వెంటాడుతుంటేనే ఆఫీసులో పనులకు నెలలు పడుతున్నాయి. మనం విదేశం పోతున్నాం" అన్నాడతడు హెచ్చరికగా.

అతడి మాటల్లో నాకు సబబు కనపడింది. అతడి పట్టుదల వల్ల ఆఫీసు బాండ్ పేపరు కొనడానికి ఇద్దరికీ చెరో మూడొందలూ అడ్వాన్సిచ్చింది. మిగతా డబ్బు మేము పెట్టుబడి పెట్టాం.

ఈ కోర్టు పేపర్లు కొనడం ఒక పెద్ద తతంగం. ముందుగా డబ్బును స్టేట్‌బ్యాంకులో కట్టి చలానా తీసుకుని ట్రెజరీకి వెళ్లి అక్కడ బోలెడు సంతకాలు చేయించుకుని - ఓ గొప్పవాడి రికమెండేషను సంపాదించుకుంటే అప్పుడవి దొరుకుతాయి. లేదా ఎక్కువ డబ్బిచ్చి స్టాంపు వెండర్ల దగ్గర కొనుక్కోవాలి. దేనికైనా కొంత టైము పడుతుంది. మాకు వ్యవధి చాలా తక్కువ. ఈ సందర్భంలో మాకు జానికిరాం అనే అసిస్టెంటు సాయపడి ఉండకపోతే చాలా ఇబ్బంది పడేవాళ్ళం. తెలుగు వాడినన్న అభిమానంతో నాకూ నాతోపాటు భూషణ్‌కీ జానకిరాం సాయపడ్డాడు. ఆ పేపర్ల మీద టైపింగు కూడా అతడే చేశాడు. వాటిపై నేనూ, భూషణ్, మా బాస్ సంతకాలు పెట్టాం.

మా టికెట్స్ 28వ తేదీకి బుక్ చేసుకున్నాం. రైల్వే పనివారల సమ్మె చాలా వరకు దెబ్బతింది. కానీ మేము ఢిల్లీ వెళ్లడానికి కలకత్తాలో ట్రెయిన్స్ దొరుకుతాయో దొరకవోనని నాకు బెంగగా ఉంది. అదృష్టవశాత్తూ కలకత్తా వెళ్లే ట్రయిన్స్ తిరుగుతున్నాయి.

స్కాలర్‌షిప్ విషయం మార్చిలో తెలిసింది. ఇంతవరకూ ఫైనాన్స్ మినిస్ట్రీ నుంచి ఉత్తర్వురాలేదు. భూషణ్, నేను బ్యూరోక్రసీని తెగ తిట్టుకున్నాం. అయితే మార్చి 25కి ఆ కాగితాలు వచ్చాయి. ఆ వెంటనే భువనేశ్వర్నించి ఢిల్లీ వెళ్ళడానికి ట్రావెలింగ్ అలవెన్స్ బిల్లు వెంటనే తయారయింది.

అనుకోకుండా అదేరోజున రిజిస్టర్డు పోస్టులో నా పాస్‌పోర్టు కూడా వచ్చింది. అది అందుకుని సగం ఆనందం పొందుతూ, ఓ క్షణం ఆపాదమస్తకం వణికిపోయాను. పోస్టులో ఇది రావడం రెండు మూడు రోజులాలస్యమయుంటే?

అందుకే కలకత్తా వెళ్లి తీసుకుంటానని అన్నయ్యకు ఉత్తరం రాశాను. అవసరపడితే ఉపయోగమని ఆథరైజేషన్ లెటరు కూడా ఇచ్చాను.

ఏది ఏమైతేనేం, అన్ని అడ్డంకులూ ఒకటొక్కటే తీరిపోతున్నాయి. మనసు తేలికపడుతోంది.

భువనేశ్వర్లో ప్రభుత్వ చేతిపనుల దుకాణం "ఉత్కళిక". అక్కడ నేను రెండు కోణార్క శిల్పాలు కొన్నాను. అవి జర్మనీలో నా ప్రొఫెసరుకు బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను.

భూషణ్ కూడా తనకు తోచినవేవో కొన్నాడు.

డిపార్టుమెంట్లో మా యిద్దరికీ ఇరవైఏడో తేదీన వీడ్కోలిచ్చారు.

ఆ రోజే అన్నయ్య నించి ఉత్తరం వచ్చింది. కాళీమాతను ప్రార్థించుకుంటే అంతా శుభమవుతుందని రాశాడన్నయ్య.

మర్నాడే ప్రయాణం. క్వార్టర్ కాళీ చేసి లాబరేటరీ సూపర్‌వైజర్‌కు అప్పగించినపుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆ కాలనీలో అడుగు పెట్టినప్పట్నించీ, ఆ క్వార్టరే నాకు, నా కుటుంబానికి, ఆశ్రయమిచ్చింది. అనుబంధం మనిషికీ మనిషికీ మాత్రమే కాదని అప్పుడే నాకర్ధమయింది.

స్టేషన్లో మాకు వీడ్కోలివ్వడానికి సహోద్యోగులు చాలామంది వచ్చారు. వారిలో ఎక్కువమంది తెలుగువారు, బెంగాలీలు. సహజమేకదా!

ఆరోజు విశేషమైనదే. కొన్నాళ్లుగా ఎండలు మండిపోతున్నాయి. ముందు రోజు రాత్రే వానపడి వాతావరణం చల్లబడింది. ఆ రోజు ఉదయమే రైల్వే పనివారలు సమ్మె విరమించిన వార్త వచ్చింది.

ట్రయిన్ అరగంట ఆలస్యంగా వచ్చి మిత్రుల వీడ్కోలుతో కదిలింది.

ఫస్ట్‌క్లాస్ కూపేలో లైటు వెలగడం లేదు. ట్రయిన్ కటక్ చేరుకున్నాక ఫిర్యాదు చేశాడు భూషణ్. మెకానిక్ వచ్చి చాలాసేపు కష్టపడి లైట్లు వెలగవనీ, కావాలంటే ఒక ఫ్యాన్ డిస్కనెక్టు చేసి ఆ లైను లైటుకిస్తాననీ అన్నాడు. గతిలేక అంతే చేయమన్నాం. అదీ మన ప్రయాణ సౌకర్య విశేషం.

ట్రయిన్ కుంటి నడక నడిచి మర్నాడు మధ్యాహ్నం పదకొండు గంటలకు మమ్మల్ని కలకత్తా చేర్చింది. భూషణ్ నన్ను ముందుగా తనకు తెలిసిన చిట్టగాంగ్ మెస్సుకు తీసుకుని వెళ్లాడు. ఆ మెస్సు వివరాలందరూ తెలుసు కోవాలి.

ఒకో గదిలో నాలుగు బెడ్లున్నాయి. మంచానికి అద్దె నెలకు పదిరూపాయలు. భోజనం నెలకు ఎనభై రూపాయలు. కలకత్తావంటి మహానగరంలో ఇటువంటి సదుపాయముండడం ఆశ్చర్యం. ఇందులో అందరికీ ప్రవేశం లేదనీ ఏదో ట్రస్టు దాన్ని నడుపుతోందనీ భూషణ్ అన్నాడు. ఒకపుడతడిందులోనే ఉండి చదువుకున్నాడుట. ఇప్పుడతడి స్నేహితులుంటున్నారు. అక్కడ మేము స్నానాలు ముగించుకుని లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ఆఫీసుకు వెళ్లాం. ఆ ఆఫీసులో పనిచేసే ఆడవారు భారతీయులైనా దుస్తుల్లో ప్రవర్తనలో యూరోపియన్స్‌ని అనుసరిస్తూ అసహ్యకరంగా ఎబ్బెట్టుగా అనిపించారు నాకు.

అక్కడ ఓ ఏజంటు సాయంతో పీ ఫారాలు పూర్తిచేసి రిజర్వు బ్యాంకుకు వెళ్లాం. అక్కడ అన్నయ్య నన్ను చూసి ఆశ్చర్యపడ్డాడు. తనకు క్లుప్తంగా వచ్చిన పని చెప్పాను.

Post your comments

( కొనసాగింపు వచ్చేనెలలో)